RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శుక్రవారం | 01 -03 - 2024
సంపుటి: 1 | సంచిక : 283 | పేజీలు : 4 | వెల : 5/-

## మార్కెట్ పదవులపై మక్కువ

3వ



# నోటిఫికేషన్ బడింది!

## 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రకటన విడుదల

4నుంచి దరఖాస్తులు | ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణ | వయో పరిమితి 46కు పెంపు | ఖరారు కాని పరీక్ష తేదీ




**హైదరాబాద్,ప్రభాతసూర్యుడు :** తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి సంబంధించి 'మెగా డీఎస్సీ-2024 నోటిఫికేషన్ ఫిబ్రవరి 29న వెలువడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితన నివాసం నుంచి డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. దీనిద్వారా మొత్తం 11,062 ఖాళీలను భర్తీ చేయనున్నారు. వీటిల్లో గత కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసిన 5,089 పోస్టులు కూడా ఉన్నాయి. ఈ పోస్టులకు అదనంగా 4,957 టీచర్ పోస్టులు, మరో 1, 016 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు కలిపి మొత్తం 11, 062 పోస్టులకు కొత్త నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీచేసింది. ఇక మొత్తంగా చూస్తే.. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ-6,508 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్-2,629 పోస్టులు, లాంగ్వేజ్ పండిట్(727, పీఈటీలు-182 పోస్టులు, ప్రత్యేక కేటగిరీ విభాగంలో స్కూల్ అసిస్టెంట్లు 220 పోస్టులు, ఎస్జీటీలు 796 పోస్టులు ఉన్నాయి.

**మార్చి 4 నుంచి దరఖాస్తులు..**

టీఎస్ డీఎస్సీ-2024 ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మార్చి 4 నుంచి ప్రారంభంకానుంది. ఏప్రిల్ 2 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యర్థులు దరఖాస్తు ఫీజు కింద రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచిన నేపథ్యంలో 46 సంవత్సరాల వయసు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే పరీక్షల తేదీలను ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. త్వరలోనే తెలియజేస్తామని ప్రకటించింది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.గతేడాది సెప్టెంబరు 6న 5,089 పోస్టులతో జారీ చేసిన డీఎస్సీ ప్రకటన రద్దుకు ప్రభుత్వం ఫిబ్రవరి 28న రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. పాతపోస్టులకు కొత్తగా ఖాళీలను జతచేస్తూ తాజాగా కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే పాత దరఖాస్తులు చెల్లుబాటులో ఉంటాయని.. కొత్త డీఎస్సీకి వాటిని పరిగణనలోనికి తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇప్పటిచే ప్రకటించారు. అంటే పాత అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. గతేడాది విడుదల చేసిన డీఎస్సీకి 1.77 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. గత దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొనేలా


సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ-6,508 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్-2,629 పోస్టులు, లాంగ్వేజ్ పండిట్ (727, పీఈటీలు-182 పోస్టులు, ప్రత్యేక కేటగిరీ విభాగంలో స్కూల్ అసిస్టెంట్లు 220 పోస్టులు, ఎస్జీటీలు 796 పోస్టులు ఉన్నాయి.

మిగతా 2వ పేజీలో...



# ఇప్పుడు రేవంతు!

## గురుదక్షిణపైనే గురి



గురువొక రాష్ట్రంలో.. శిష్యుడు మరొక రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా ఉంటే ఆ సీనే వేరు. పొలిటికల్ గా ఆ కిక్కే సపరేట్. గురువును మించిన శిష్యుడిగా పాలనలో నిరూపించుకునే వీలు కూడా రేవంత్ కు దక్కుతుంది. అంతే కాకుండా తనకు శత్రువుగా భావించే జగన్‌ను ఓడిస్తే తన రాష్ట్రంలో కొంచెం తనకు ఫ్రీ హ్యాండ్ ఉంటుంది. చంద్రబాబుకు కేంద్రంలోనూ గ్రిప్ ఉంటుంది కాబట్టి తన పదవి కూడా పదిలంగా ఉంటుంది. ఇన్ని లెక్కలున్నాయ్ మరి.

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** లంగాణలో శాసనసభ ఎన్నికలు ముందు జరుగుతాయి. ఏపీలో పార్లమెంటు ఎన్నికలతో పాటు తర్వాత జరుగుతాయి. రెండు ఎన్నికల మధ్య నెలల గ్యాప్ ఉంటుంది. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిందే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రివర్స్ అవుతుందని అంటున్నారు. కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిగా రెండు సార్లు విజయం సాధించారు. 2014, 2018 ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికలలో 2014 ను పక్కన పెడితే 2018 ఎన్నికల్లో మాత్రం లోపాయికారీగా కేసీఆర్ వైసీపీ అధినేత జగన్ కు మద్దతిచ్చారన్న విమర్శలున్నాయి. నిధులతో పాటు చంద్రబాబుపై నెగిటివ్ కామెంట్స్ చేసి అప్పుడు జగన్ కు అనుకూలంగా ఎన్నికల ఫీల్డ్ ను మార్చారన్నది టీడీపీ నేతలు బహిరంగంగానే విమర్శలు చేశారు. జగన్ గెలవాలని కేసీఆర్ బలంగా కోరుకున్నారని అంటారు. ఎందుకంటే తనకంటే సీనియర్ అయిన చంద్రబాబు పొరుగు రాష్ట్రంలో ఉంటే తనకు అన్ని రకాలుగా ఇబ్బందులు ఉంటాయని ఆయన జగన్‌కు నాడు మద్దతిచ్చారంటారు. చంద్రబాబును మొత్తం చదివేసిన కేసీఆర్ ఆయనను

మిగతా 2వ పేజీలో...



## వీవీఎస్ లక్ష్మణ్ కమలం ఆఫర్

3వ



## సింగర్ చిన్మయి శ్రీపాదపై కేసు

3వ



## మేడారం మొక్కుల్లో నకిలీ నోట్లు

4వ

# కేసీఆర్‌పై నమ్మకం పోయిందా?



అరవై రోజుల్లో పరిస్థితి మారిపోయింది. మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలయింది. అంతా ఆయనే చేశాడంటూ పెదవి విరుపులు వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థల నేతలయితే పార్టీ ఫిరాయిస్తున్నారు.

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : రాజకీయాలు అంటే అలాగే ఉంటాయి. విజయం సాధించినప్పుడు ఆ క్రెడిట్ పార్టీ అధినేతకే దక్కుతుంది. అదే ఓటమి పాలయితే.. మాత్రం ఆ నేతపై నమ్మకం సన్నగిల్లి పోతుంది. జాతీయ పార్టీలు అయినా.. ప్రాంతీయ పార్టీలు అయినా ఒక్కటి మాత్రం నిజం. పార్టీ అధినేత ఖాతాలోకే గెలుపు, ఓటముల క్రెడిట్‌లు చేరిపోతాయి. బీజేపీ గెలిస్తే మోదీ వల్ల, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాహుల్ వల్లేనని అందరూ విశ్వసిస్తారు. అలాగే బీఆర్ఎస్ గెలిస్తే కేసీఆర్ వల్ల గెలిచిందంటారు. ఆయన వ్యూహాలకు సలాం కొడతామంటారు. ఆయన నివాసానికి క్యూ కడుతుంటారు. కేసీఆర్ వీరుడు.. శూరుడు.. విక్రమార్కుడు అంటూ ప్రశంసలు కురిపిస్తారు. మొన్నటి వరకూ... మొన్నటి ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకూ ఆయన కంటే గొప్పోడు మరొకరు లేరన్నారు. ఆయన వ్యూహాలకు మరే రాజకీయ నేత ఆలోచనలకు సాటి రావన్నారు. స్కెచ్ వేస్తే సెటిల్ అయినట్లేనని అనే వీర ఫ్యాన్స్ కూడా చాలా మంది ఉన్నారు. అందుకే కేసీఆర్ మా నాయకుడు అంటూ చొక్కా బటన్‌లు విప్పి మరి చెప్పుకున్నారు. కానీ అరవై రోజుల్లో పరిస్థితి మారిపోయింది. మొన్నటి ఎన్నికల్లో

మిగతా 2వ పేజీలో...

### తెలంగాణలోనూ వలంటీర్ల వ్యవస్థ

# ఇందిరమ్మ సైన్యం!



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ఏపీ ముఖ్యమంత్రి జగన్ బాటలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నడవనున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సామాన్యులకు చేరువయ్యేలా సీఎం జగన్ వినూత్నంగా వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వాలంటీర్ల వ్యవస్థ ఎంత సక్సెస్

మిగతా 2వ పేజీలో...

ప్రతిగ్రామంలో ఐదుగురితో ఇందిరమ్మ కమిటీలు వేసి వారి ద్వారా లబ్ధిదారులకు పథకాలు అందేలా చేస్తామని తాజాగా రేవంత్ రెడ్డి ప్రకటించారు.గత పదేళ్లలో పార్టీకోసం నిలబడిన వారికే ఇందిరమ్మ కమిటీల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

# రేవంత్‌కు కెటిఆర్ ప్రతిసవాల్



**హైదరాబాద్- ప్రభాతసూర్యుడు :** గెలిచిన ప్రతిసారి మగవాడిని ?. ఒడితే కాదు అంటావా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌ను నిలదీసారు. కొడంగల్ లో ఒడిపోయినప్పుడు మగడివికాదా. మగాడివి అయితే, రైతులకు 2 లక్షల రుణ మాఫీ చేయమని అన్నారు. ఆడబిడ్డలకు 2500 ఇవ్వు ఇచ్చిన 420 హామీలు అమలు చెయ్యి. అడవాళ్ల రాజకీయాల్లో గెలవవద్దా? ఇదే మాటాలు. రేవంత్ కు ఇన్ పిరియారిటీ కాంప్లెక్స్ ఉందని అయన అన్నారు. కొండగల్,

మిగతా 2వ పేజీలో...

# కోటి ఇళ్లకు ఫ్రీ కరెంట్

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీఎం సూర్యఘర్ యోజనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చారు. కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత్ విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించారు. 2025 నాటికి ప్రతి కేంద్ర ప్రభుత్వ కార్యాలయం మీద రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుకు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. ఈ పథకంతో పేదలకు ఏడాదికి రూ.18 వేల వరకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర మంతి అనురాగ్ ఠాకూర్ వివరించారు. సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు.. ఈ పథకానికి రూ.75021 కోట్ల నిధులు కేటాయించారు. ఈ పథకాన్ని ఫిబ్రవరి 13న ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు.అంతేకాకుండా.. చిప్ ఎకోసిస్టమ్ కోసం రూ. 1.26 లక్షల కోట్ల సంచిత పెట్టుబడికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 1.26 లక్షల కోట్ల విలువైన



పీఎం సూర్యఘర్ యోజనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చారు. కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత్ విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించారు.

మిగతా 2వ పేజీలో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## మేడారం హుండీ లెక్కింపు ప్రారంభం



**ములుగు- ప్రభాతసూర్యుడు :**
గురువారం నాడు మేడారం హుండీల లెక్కింపు ప్రారంభమయింది. లెక్కింపు కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. హనుమకొండ లోని టీటీడీ కళ్యాణ మండపంలో లెక్కింపు జరుగుతోంది. పదిరోజుల పాటు లెక్కింపు కొనసాగనుంది. పటిష్టమైన భద్రత మధ్య లెక్కింపు ప్రక్రియ కొనసాగునుంది. లెక్కింపు కేంద్రం లోపల-బయట సీసీ కెమెరాలు,భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ వుంటుంది. మొత్తం 512 హుండీలను లెక్కించనున్నారు.

# ధరణి ముందడుగు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
తెలంగాణలో భూ రికార్డుల ప్రక్షాళనలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ లో సమస్యల పరిష్కారానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు తాజాగా మార్గదర్శకాలు కూడా జారీ చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్లు, కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేశారు. మార్చి 1 నుంచి 9 వరకూ అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్లకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) ఆదేశాలు జారీ చేశారు. ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గైడ్లైన్స్ విడుదల చేసింది. మొన్న జరిగిన సమీక్షలో ధరణి భూములపై ఫోకస్ చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్. ఈ నేపథ్యంలోనే కలెక్టర్లకు సరికొత్త గైడ్లైన్స్ జారీ చేసింది సీసీఎల్ఏ.

మార్చి ఒకటి నుంచి మార్చి 9 వరకు ధరణి సమస్యలు పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. 24వ తారీఖు ధరణిపై సీఎం చేసిన రివ్యూలో ధరణి అప్లికేషన్లను వెంటనే క్లియర్ చేయాలని అధికారులకు అదేశించారు. అందుకు అనుగుణంగా కొన్ని సూచనలు చేసింది ధరణి కమిటీ. తాహసీల్దార్, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ల సమక్షంలో కమిటీలు వేసింది.ఒక టైం లైన్ విధించి ఆ లోపల పెండింగ్ అప్లికేషన్లను క్లియర్ చేయాలని అధికారులను అదేశించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ నేపథ్యంలోనే కరెక్షన్ చేసిన అప్లికేషన్ల వివరాలను ఎలక్ట్రానిక్స్ రికార్డ్సులో భద్రపరచాలని సూచించారు అధికారులు.

ధరణి అడ్డం పెట్టుకొని ఆక్రమించిన ప్రభుత్వ భూముల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులకు అదేశించారు. ఆధార్ నెంబర్ మిస్ మ్యాచ్, రైతుల పేర్లు తప్పుగా ప్రచురించబడి ఆగిపోయిన అప్లికేషన్స్, ఫోటో మిస్ మ్యాచ్ వంటి పెండింగ్ అప్లికేషన్లను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అసైన్డ్ ల్యాండ్ల సమస్యలు పరిష్కరించాలని కూడా సీఎం రేవంత్ గతంలో అధికారులకు తెలిపారు. దీంతో పాటు పాస్ బుక్ కరెక్షన్స్, పాస్ బుక్‌లో మిస్ అయిన పేర్లు వాటి సర్వే నెంబర్లు, కాటా మెర్జింగ్ వంటి సమస్యలు కూడా సరిచేసి సరైన రికార్డులు మెయింటెన్ చేయాలని కోరారు. ఈ తరుణంలో గ్రామ, మండల స్థాయి అధికారులనుంచి జిల్లా స్థాయి అధికారులకు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు ఛీఫ్ సెక్రటరీ శాంతి కుమారి.

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గైడ్లైన్స్ విడుదల చేసింది. మొన్న జరిగిన సమీక్షలో ధరణి భూములపై ఫోకస్ చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్. మార్చి ఒకటి నుంచి మార్చి 9 వరకు ధరణి సమస్యలు పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

## రాడిసన్ డ్రగ్స్‌లో కొత్త కోణాలు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** గచ్చిబౌలి ర్యాడిసన్ హోటల్ లో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం వచ్చిందని.. అందుకే ఎస్ఓటీ పోలీసులు సోదాలు చేశారని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. కొకైన్ పార్టీ వ్యవహారంలో మంజీరా గ్రూప్ డైరెక్టర్ జి. వివేకానందను అరెస్ట్ చేశామని చెప్పారు. అతనితో పాటు నిర్భయ్, కేదార్ లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. తాము నిర్వహించిన వైద్య పరీక్షల్లో ముగ్గురు కొకైన్ తీసుకున్నట్లు వైద్య పరీక్షల్లో తేలిందని చెప్పారు. ర్యాడిసన్ హోటల్ పై తాము కేసులు కూడా నమోదు చేస్తామని చెప్పారు. ఇక్కడి నిందితులకు సయ్యద్ అబ్బాస్ అనే వ్యక్తి డ్రగ్స్ అమ్మినట్లు తెలిసిందని సీపీ వివరించారు. అతని కోసం వెతుకుతున్నామని.. వారు డేటాని డిలీట్ చేసినా.. రీట్రైవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.పట్టుబడిన వారిలో వివేకానంద మంజీర గ్రూప్ కి డైరెక్టర్ గా ఉన్నాడని సీపీ చెప్పారు. ఇంటికి వెళ్లిన సమయంలో పోలీసులకు విచారణకు సహకరించ కుండా కొంత ఇబ్బంది పెట్టారని అన్నారు. డ్రగ్స్ టెస్ట్ లో వివేకానందతో పాటు నిర్భయ్, కేదార్‌కు కూడా పాజిటివ్ వచ్చిందని అన్నారు. వివేక్ కు యూరిన్ టెస్ట్ చేయించగా.. కొకైన్ తీసుకున్నట్లు రిపోర్ట్ వచ్చిందని వివరించారు. మొత్తం ఈ పార్టీలో 10 మంది ఉన్నట్లు గుర్తించామని సీపీ వెల్లడించారు. వివేకా నంద, నిర్భయ్, కేదార్ పై 121ఎ 27, ఔఆఖూ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని వివరించారు. వారు డ్రగ్స్ ద్వారా సంపాదించినట్లు అనుమానిస్తున్నామని.. ఆ ఆస్తులను కూడా తాము అటాచ్ చేస్తున్నామని సీపీ అవినాష్ మహంతి తెలిపారు.

## కేసీఆర్‌పై నమ్మకం పోయిందా?

**మొదటిపేజీ తరువాయి..**
బీఆర్ఎస్ ఓటమి పాలయింది. అంతా ఆయనే చేశాడంటూ పెదవి విరుపులు వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థల నేతలయితే వెంటనే పార్టీ ఫిరాయిస్తున్నారు. మున్సిపాలిటీలకు మున్సిపాలిటీల్లో గులాబీ జెండాను దించేసి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తున్నారు.
పార్లమెంటు ఎన్నికల్లో...
ఇక ఇదిలా ఉండగా ఇటీవలే కేసీఆర్ విశ్రాంతి తర్వాత బయటకు వచ్చారు. నల్లగొండ సభలోనూ ఆయన పాల్గొన్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఆయన పార్టీని గాడిలో పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. అయితే అనేక చోట్ల పోటీకి నేతలు విముఖత చూపుతుండటం విశేషం. అభ్యర్థుల కొరత అని చెప్పలేం కానీ, గతంలో క్యూ కట్టినట్లు ఇప్పుడు కారు పార్టీ టిక్కెట్ కోసం ఎవరూ వెంపర్లాడటం లేదు. కాంగ్రెస్ గెలవడంతో పాటు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉండటం, పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ విజయావకాశాలు ఉన్నాయన్న అంచనాలతో బీఆర్ఎస్ పార్టీ వైపు చూడటానికి జంకుతున్నారు. తెలంగాణలో పదిహేడు నియోజకవర్గాలలో బీఆర్ఎస్ అభ్యర్థులు



నిలబెట్టలేదని మాత్రం కాదు. కానీ సమర్థులైన... ఆర్థికంగా బలవంతులైన వారిని మాత్రం పోటీకి దింపలేని పరిస్థితి ఉందన్నది మాత్రం వాస్తవం. కొందరిని నచ్చచెప్పి.. ఒప్పించి బలవంతంగా బరిలోకి దింపాల్సిన పరిస్థితి నేడు బీఆర్ఎస్ లో తలెత్తిందంటే ఎన్నికల ఫలితాల మహిమే. అదే కేసీఆర్. అదే మైండ్.. అవే ఆలోచనలు.. మరి ఆ వ్యూహాలు ఎక్కడికి వెళ్లాయి? ఆ స్కెచ్ లు సక్సెస్ కాకుండా ఎందుకు పోయాయంటే మాత్రం సరైన సమాధానం దొరకదు. ప్రజలు తలచుకుంటే ఏదైనా చేయగలరన్న దానికి ప్రస్తుత బీఆర్ఎస్ పరిస్థితి నిదర్శనంగా చెప్పుకోవాలి.

## ఇప్పుడు రేవంతు!

**మొదటిపేజీ తరువాయి..**
ఎన్నికల వేళ టార్గెట్ చేసి జగన్ కు పరోక్షంగా సాయపడ్డారంటారు. కేవలం మాటలే కాదు.. పెద్దయెత్తున మూటలు కూడా కేసీఆర్ నాడు జగన్ పార్టీకి అందించారన్న విమర్శలు అప్పట్లో వినిపించాయి. అందుకే 2019లో జగన్ విజయం సాధించిన తర్వాత ఆయన ప్రమాణస్వీకారానికి కేసీఆర్ వెళ్లి పెద్దరికంతో ఆశీర్వదించి వచ్చారని కూడా అంటారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎలాంటి వ్యాఖ్యలకు చోటుండదు. ఏ కోమటిరెడ్డి వెంకటరెడ్డో.. ఉత్తమ్ కుమార్ రెడ్డో లేదా భట్టి విక్రమార్క ముఖ్యమంత్రిగా ఉంటే ఇలాంటి అపోహలకు తావుండదు. కానీ ముఖ్యమంత్రి స్థానంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. ఆయన చంద్రబాబుకు ఏకలవ్య శిష్యుడిగా ఉంటారు. తన రాజకీయ గురువు చంద్రబాబు అని చెప్పుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమాత్రం వెనుకంజ వేయరు. ఏపీలో ఎన్నికలున్నాయి కాబట్టి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు రాలేదు కానీ, లేకుంటే రెక్కలు కట్టుకుని వాలి ఉండేవారంటారు.

### గురువు గారు గెలవాలని...

అలాంటి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఏపీలో తన గురువుగారు గెలవాలని సహజంగానే కోరుకుంటారు. గురువొక రాష్ట్రంలో.. శిష్యుడు మరొక రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా ఉంటే ఆ సీనే వేరు. పొలిటికల్ గా ఆ కిక్కే సపరేట్. గురువును మించిన శిష్యుడిగా పాలనలో నిరూపించుకునే వీలు కూడా రేవంత్ కు దక్కుతుంది. అంతే కాకుండా తనకు శత్రువుగా భావించే జగన్‌ను ఓడిస్తే తన రాష్ట్రంలో కొంచెం తనకు ఫ్రీ హ్యాండ్ ఉంటుంది. చంద్రబాబుకు కేంద్రంలోనూ గ్రిప్ ఉంటుంది కాబట్టి తన పదవి కూడా పదిలంగా ఉంటుంది. ఇన్ని లెక్కలున్నాయ్ మరి. అందుకే రేవంత్ రెడ్డి సహజంగానే చంద్రబాబు గెలవాలని కోరుకుంటారు. అందులో తప్పేమీ లేదు. ఇప్పుడు పెద్దయెత్తున నిధులను తన గురువు గారి కోసం రేవంత్ ఇక్కడి పారిశ్రామికవేత్తల నుంచి సమీకరిస్తున్నారన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినపడుతున్నాయి. కనపడుతున్నాయి. అయితే అందులో నిజానిజాలు పక్కన పెడితే జగన్ ప్రచారానికి మాత్రం ఏపీలో మంచి ఫుడ్డు దొరికిందనే చెప్పాలి.

## నోటిఫికేషన్ బడింది!

**మొదటిపేజీ తరువాయి..**
సాఫ్ట్‌వేర్‌ను రూపొం దించారు. అప్పట్లో దరఖాస్తు చేసుకున్న వారు తాజాగా మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. మే నెలలో డీఎస్సీ రాత పరీక్షలను కంప్యూటర్‌బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహించే అవకాశం ఉన్నది. మొత్తం 10 రోజుల పాటు ఈ పరీక్షలు జరుగుతాయి. ఒకే అభ్యర్థి సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులతో పాటు స్కూల్ అసిస్టెంట్‌లో గణితం, ఫిజిక్స్ వంటి వివిధ సబ్జెక్టులకు పోటీపడనున్న నేపథ్యంలో పరీక్షలను వేర్వేరు తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్‌పై భారీగా ఆశలు పెట్టుకున్నారు. దాదాపు 4 లక్షల మంది ఇప్పటికే ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులయ్యారు. వాళ్లంతా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రశ్నపత్రాలు మొదలుకొని ఫలితాల వరకూ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఇందులో భాగంగా సాఫ్ట్‌వేర్ రూపకల్పనపై మరింతగా దృష్టి పెట్టారు. పాస్‌వర్డ్స్, ఆన్‌లైన్ వ్యవస్థ భద్రతాంశాలను ఉన్నతాధికారులు సమీక్షించారు. సాంకేతిక విభాగంలో ప్రైవేటు సంస్థల పాత్ర ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధి కారులు విద్యాశాఖ సిబ్బందిని ఆదేశించారు. కీలకపాత్ర పోషించే అధికారులు ప్రతి అంశాన్నీ పరిశీలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.

**ముఖ్యమైన తేదీలు..**
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 04.03.2024.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 02.04.2024.
- పరీక్ష తేదీ: ప్రకటించాల్సి ఉంది.

## ఇందిరమ్మ సైన్యం!

**మొదటిపేజీ తరువాయి..**
అయ్యిందో అందరికీ తెలుసు. ఈ వ్యవస్థ ముఖ్యమంత్రి జగన్‌కు పరిపాలనలోనూ, రాజకీయంగా పార్టీకి ఎంతో ఉపయుక్తంగా మారింది. ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటీర్ నియమించారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన అన్ని పథకాలు, సౌకర్యాలను అందించే బాధ్యత ఆ వాలం టీర్‌దే. సామాజిక పింఛన్ల దగ్గర నుంచి.. అమ్మఒడి, ఆసరా పథకాల లబ్ధిదారుల ఎంపిక బాధ్యత మొత్తం వాలంటీర్లే చూసుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.5 వేల రూపాయల గౌరవ వేతనంతోపాటు ఏడాదికి ఒకసారి వాలంటీర్ రత్న ప్రోత్సహ కాలు అందిస్తోంది. అయితే, పేరుకే వాలంటీర్లు అని.. వీరంతా వైసీపీ కార్యకర్తలేనని విపక్షాలు ఆరోపిస్తుంటాయి. ప్రతి 50 కుటుంబాలకు ఒకరిని నియమించి.. వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం వాలంటీర్ల వ్యవస్థ ద్వారానే అందిస్తున్నారు. ఇప్పుడు ఇదే పద్ధతిని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అనుసరించనున్నారు. ప్రతిగ్రామంలో ఐదుగురితో ఇందిరమ్మ కమిటీలు వేసి వారి ద్వారా లబ్ధిదారులకు పథకాలు అందేలా చేసామని తాజాగా రేవంత్ రెడ్డి ప్రకటించారు.వాలంటీర్ వ్యవస్థను తీసుకురావడం వల్ల జగన్‌కు బాగా ఉపయోగపడిందనేది వారి వాదన. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంతోపాటు.. అవన్నీ జగన్, వైసీపీ ప్రభుత్వ చలవేనంటూ వాలంటీర్లు ప్రజల్ని మభ్యపెడుతున్నారని అంటున్నారు. పరోక్షంగా వాలంటీర్లు రాజకీయంగా జగన్‌కు ఎంతో ఉపయోగపడుతున్నారనే అభిప్రాయం ఉంది. వైసీపీకి ఓటు వేయాలని.. లేకుంటే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయంటూ బెదిరింపులకు పాల్పడుతున్న ఘటనలను విపక్షాలు వెలుగులోకి తీసుకువస్తున్నాయి. ఇక వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరి డేటా ఇప్పుడు జగన్ గుప్పెట్లో ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. రానున్న ఎన్నికల్లో వాలంటీర్ల ద్వారా నయానో, భయానో ఓట్ల శాతాన్ని పెంచుకునే అవకాశం జగన్‌కు వచ్చిందని అంటున్నారు.ఇప్పుడు సరిగ్గా ఇదే పద్ధతిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరించనున్నారు. ప్రజలందరికీ సంక్షేమపథకాలు అందించేందుకు ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఇందిరమ్మ కమిటీలు నియమించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు వీరు వారధులుగా పనిచేయనున్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పార్టీకోసం పనిచేసిన వారికే అవకాశం గత పదేళ్లలో బీఆర్ఎస్ అరాచకాలను ఎదురించి పార్టీకోసం నిలబడిన వారికే ఇందిరమ్మ కమిటీల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కష్టపడి పనిచేసిన వారికే ఊరిలో ఎవరికి ఏం ఇవ్వాలో తెలుస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రతి గ్రామంలోనూ వివిధ సామాజికవర్గాల నుంచి ఎంపిక చేసిన ఐదుగురి పేర్లను స్థానిక ఎమ్మెల్యే లేదా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ద్వారా సంతకం పెట్టించి జిల్లా మంత్రులకు అందజేయాలన్నారు.తక్షణమే ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీలను వారి ద్వారానే ప్రజలకు అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెపారు. కష్టపడిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను గుర్తుపెట్టుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## కోటి ఇళ్లకు ఫ్రీ కరెంట్

**మొదటిపేజీ తరువాయి..**చిప్ ఎకోసిస్టమ్ కోసం సంచిత పెట్టుబడిని కేంద్రం ఈరోజు ఆమోదించిందని అశ్విని వైష్ణవ్ చెప్పారు. ధొలేరా యూనిట్ రూ. 91,000 కోట్లు, అస్సాం యూనిట్ రూ. 27,000 కోట్లు, సనంద్ యూనిట్ రూ. 7,600 కోట్లుగా నిర్ణ యించారు. గుజరాత్‌లోని సనంద్ లోని మూడవ చిప్ ఫ్యాబ్ యూనిట్‌లో, పవర్, జపాన్‌కు చెందిన పునరు జ్జీవన సంస్థలు రోజుకు 15 మిలియన్ చిప్‌లను ఉత్పత్తి చేస్తాయి, అంటే ఒక సంవత్సరంలో 550 కోట్ల చిప్‌లు.. ఉత్పత్తి చేస్తాయని వివరించారు.అస్సాంలో ఏర్పాటు చేయనున్న సెమీకండక్టర్ యూనిట్‌లో టాటా రూ.27,000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. చాలా



పెద్ద ఆటో కంపెనీలు ఈ ప్లాంట్ చిప్‌లను ఉపయోగిస్తాయని, ఇది రోజుకు 48 మిలియన్ చిప్‌లను ఉత్పత్తి చేస్తుందని అశ్విని వైష్ణవ్ చెప్పారు. భారతదేశంలో ప్రధాన కార్యాలయంతో ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబిసిఎ) ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2027-28 వరకు ఐదేళ్ల కాలానికి రూ.150 కోట్ల వన్-టైమ్ బడ్జెట్ మద్దతును కూడా ఆమోదించింది.పన్నెండు క్లిష్టమైన, వ్యూహాత్మక ఖనిజాలను ప్రభుత్వం గుర్తించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. అవి: ఎరిలియం, కాడ్మియం, కోబాల్ట్, గాలియం, ఇండియం, రీనియం, సెలీనియం, టాంటాలమ్, టెల్లూరియం, టైటానియం, టంగ్‌స్టన్, వనాడియం.. రాయల్టీ రేటు నిర్దేశానికి నేటి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం వల్ల దేశంలోనే తొలిసారిగా ఈ 12 ఖనిజాల బ్లాకులను వేలం వేయడానికి కేంద్ర ప్రభుత్వం వీలు కల్పిస్తుంది. ఖనిజాలపై రాయల్టీ రేటు అనేది బ్లాకుల వేలంలో బిడ్డర్లకు ముఖ్యమైన ఆర్థికపరమైన అంశం.. ఇది మొత్తం 24 కీలకమైన, వ్యూహాత్మక ఖనిజాల కోసం రాయల్టీ రేట్ల హేతుబద్ధీకరణను పూర్తి చేస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు.

## రేవంత్‌కు కెటిఆర్ ప్రతిసవాల్

**మొదటిపేజీ తరువాయి..**
జియచ్ యంసి సమయంలో పోటీ చేసి, సవాల్ విసరి పారిపోయిండు. అయన మాటకు విలువ ఏం ఉంది. రేవంత్ గా కు దమ్ముంటే సిఏం కు రాజీనామా చేయండి? మల్కాజ్ గిరిలో పోటీ చేద్దాం. అదే అయన సిట్టింగ్ సీటే కదా దమ్ముంటే పోటీకి రావాలి. నేను సిరిసిల్లాలో ఏంఎల్యేలకు పదవి రాజీనామా చేస్తా. దమ్ముంటే రేవంత్ సిఏం పదవికి రాజీనామా పోటీకి రావాలి. రాజకీయాల్లో గెలుపు ఒటములు సహాజం. మరి నాది మేనేజ్ మెంట్ కోటా అయితే, రాహుల్, ప్రియంకాలది ఏం కోటా. రేవంత్ ది పేమేంట్ కోటా, మాణిక్యం ఠాకూర్ కి డబ్బులిచ్చి పదవులు తెచ్చుకున్న పేమేంట్ కోటా. పేమేంట్ కోటాలో సీటు తెచ్చుకున్నందుకే రేవంత్, డీల్లీకి పేమేంట్ చేయాలి. బిల్డర్లను బెదిరించాలి. వ్యాపారులను బెదిరించాలి. డీల్లీకి కప్పం కట్టాలి, బ్యాగులు మోయాలని అన్నారు. అందుకే భవన నిర్మాణ అనుమతులు అపినారు? ఎన్ని అనుమతులు ఇచ్చారో చెప్పాలి. త్వరలో బిల్డర్లు, వ్యాపారులు రేవంత్ సెస్ పైన రోడ్డు ఎక్కుతారు. అయన నేనే సిఏం అని అన్ని సార్లు చెప్పుకుంటున్నారు? అయనకు అయననే సిఏం అన్న నమ్మకం లేదా అని ప్రశ్నించారు.

శుక్రవారం | 01 మార్చి 2024 | 3

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# కత్తులతో దాడి కేసులో కొత్త ట్విస్ట్

మేడ్చల్- ప్రభాతసూర్యుడు : ఉప్పల్ పోలీస్ స్టేషన్ లో మల్కాజిగిరి డీసీపీ పద్మజ రెడ్డి మీడియా సమావేశం లో మాట్లాడుతూ పొలిటికల్ నాయకుడిగా ఎంటర్ అయిన ఉదయ్ భాస్కర్ గౌడ్, గతంలో తనపై అనేక క్రిమినల్ కేసులు ఉ ఒడటం వలన, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్ప- ర్చుకోవడం కోసం తనపై అటెంప్ట్ మర్డర్ సృష్టించుకున్నాడని అన్నారు. స్నేహితులు వర్కాల శివ గౌడ్, మిరపకాయల సంతోష్ రెడ్డి లతో కలిసి ప్లాన్ సెట్ చేసిన ఉదయ్ భాస్కర్ గౌడ్.. ఈనెల 24న ఈ ముగ్గురు, తెలిసిన మరో ఐదుగురితో కలిసి ఉప్పల్ బాగాయత్ లో సాయంత్రం ఫేక్ అటెంప్ట్ మర్ధర్ ని సృష్టించారు. ఉదయ్ భాస్కర్ గౌడ్ పై గతంలో నాచారం, కీసర, మాదాపూర్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ లలో క్రిమినల్ కేసులు వున్నాయి. ఓ మర్డర్ కేసులో 2018లోనే ఉదయ్ భాస్కర్ గౌడ్ పై మేడిపల్లి పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేసారు. ఈ ఫేక్ అటెంప్ట్ మర్డర్ కేసులో మొత్తం ఎనిమిది మంది ఉండగా ఆరుగురుని అరెస్టు చేశామని మిరపకాయల సంతోష రెడ్డి, మహేష్ అనే ఇద్దరు పరారీలో ఉన్నారని వారికోసం పోలీస్ టీమ్స్ వెతుకుతున్నట్టు, ఈ ఆరుగురు నిందితుల్ని రిమాండ్ కి తరలిస్తున్నట్లు డీసీపీ పద్మజ రెడ్డి తెలిపారు.



# వీవీఎస్ లక్ష్మణ్‌కు కమలం ఆఫర్

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు ఆసక్తిగా మారాయి. మెజార్టీ గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఈ క్రమంలోనే కీలక వ్యక్తులను ఈ ఎన్నికల్లో బరిలో దించాలని బీజేపీ భావిస్తోంది. ఈ సందర్భంగా భారత మాజీ క్రికెటర్, హైదరాబాద్ వాసీ వీవీఎస్ లక్ష్మణ్‌పై గురిపెట్టినట్లు పొలిటికల్ సర్కిల్లో టాక్ నడుస్తోంది. వీవీఎస్ లక్ష్మణ్ బీజేపీ నుంచి ఎంపీగా బరిలో దింపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని టాక్ నడుస్తోంది. గతంలో సైతం వీవీఎస్ లక్ష్మణ్ బీజేపీలో చేరుతారనే ప్రచారం జరిగింది.ఎన్నికల్లో మెజార్టీ విజయం సాధించాలని వీవీఎస్ లక్ష్మణ్‌ను బీజేపీ ఎంపీ టికెట్ ఇవ్వాలనే బీజేపీ నేతలు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం అందుతోంది. అయితే ఎంపీ టికెట్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం ఇస్తే బాగుంటుందని బీజేపీ పెద్దలు ఆలోచిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఈ టికెట్ మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు ఫిక్స్ అయినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో బీజేపీ పాలిటిక్స్ రాష్ట్రంలో మరింత ఆసక్తి గా మారాయి. ఈ వ్యవహారంపై వీవీఎస్ లక్ష్మణ్ ఏ విధంగా స్పందిస్తారనేది మాత్రం వేచి చూడాలి.కాగా, బీజేపీ అధిష్టానం సైతం తెలంగాణ ఎన్నికలపై ఫోకస్ పెంచింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను పక్కకు నెట్టి ముందు వరుసలో ఉండాలని చూస్తోంది. ఈ క్రమంలోనే తెలంగాణలో ప్రధాని మోడీ పర్యటన ఖరారు అయింది. మార్చి నెల 4వ తేదీన ఆదిలాబాద్ జిల్లాకు ప్రధాని రానున్నారు. ఈ మేరకు తాజాగా షెడ్యూల్ విడుదల అయింది. మార్చి 4వ తేదీన ఉదయం 10: 20 కి ఆదిలాబాద్ హెలిప్యాడ్ కు చేరుకుంటారు. తర్వాత 10:30 నుంచి 11 గంటల వరకు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం ప్రధాని ఆదిలాబాద్ పబ్లిక్ మీటింగ్ లో నిర్వహించనున్నారు.

# మార్కెట్ పదవులపై మక్కువ

ఆదిలాబాద్, ప్రభాతసూర్యుడు : కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేక మంది నేతలు మార్కెట్ ఛైర్మన్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. రిజర్వేషన్ల మేరకు నేతలు ఎమ్మెల్యేలను కలిసి తమకు పదవి ఇవ్వాలని కోరుతున్నారు. ఇటీవల మార్కెట్ కమిటీల పాలకవర్గంపై మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు స్పష్టత ఇవ్వడంతో ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు.ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, చెన్నూరు, ఖానాపూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్య ర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. మిగిలిన నియోజకవ ర్గాల్లో పార్టీ నేతలు సూచించిన పేర్లను ఇన్చార్జి మంత్రి ప్రతిపాదించే అవకాశం ఉండటంతో స్థానిక నేతలతో కలిసి పదవి పొందేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.గతంలో మాదిరిగా పాలకవర్గ పదవీకాలం రెండేళ్లు ఉండటంతో పాటు ఆరేసి నెలలు రెండు సార్లు పదవీకాలాన్ని పెంచుకునే వీలుం దని తెలుస్తుంది. పాలకవర్గం పదవీకాలం మూడేళ్ల పాటు కొనసాగే అవకాశం గతంలో మాదిరిగా మార్కెట్ ఛైర్మన్ల పదవులకు రోస్టర్ విధానంతో పాలకవర్గాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఉన్న తాధికారులకు మంత్రి సూచించినట్లు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లో మార్కెట్ కమిటీ ఛైర్మన్‌ల ఎంపిపై మార్గదర్శకాలు జారీ చేసే వీలుందని మార్కెట్ అధికారులు తెలిపారు.




## ఉమ్మడి ఆదిలాబాద్ లో 17 మార్కెట్ లు?

తెలంగాణ వ్యవసాయ మార్కెట్ చట్టం ప్రకారం పాలకవర్గంలో 18 మంది సభ్యులతో పాలకవర్గం ఏర్పాటు చేయాలి. ఇందులో మార్కెట్ కమిటీ పరిధిలో ఉ ఒడే రైతులు 12 మంది ఉండాలి. వ్యవసాయ అను బంధ రంగాల నుంచి కనీసం అయిదుగురు సభ్యులు ఉండాలి. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవ ర్గాలు, మహిళలు ఉండాలి.లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు, మార్కెట్ పరిధిలోని సహకార సంఘాల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, వ్యవసా యంతోపాటు అనుబంధ శాఖ అధికా రుల్లో ఒకరు, మార్కెట్ పరిధిలోని పురపాలక ఛైర్మన్ లేదా గ్రామ సర్పంచుల్లో ఒకరు సభ్యుడిగా ఉంటారు.18 మందితో కూడిన పాల కవర్గం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే, లేదా ఇన్చార్జి మంత్రి ఆమోదంతో మార్కెటింగ్ శాఖకు పంపిస్తారు. పాలకవర్గం ఏర్పాటుకు ఆమోదం తెలియచేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. కమిటీలోని 12 మంది రైతుల్లోనే ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు ఉండాలి.

## రిజర్వేషన్‌లు ఇలా...

ఆదిలాబాద్- జనరల్, జైనథ్- జనరల్, ఇచ్చోడ- ఎస్టీ, ఇంద్ర వెల్లి- ఎస్టీ, బోథ్-బీసీ, ఆసిఫా బాద్-బీసీ, బి(మహిళ), కాగజ్నగర్ -ఎస్సీ, జైనూర్ఎస్టీ, మంచిర్యాల- జనరల్ (మహిళ), లక్షెట్టిపేట- ఎస్సీ, జన్నారం-ఎస్సీ, బెల్లంపల్లి- ఎస్సీ(మహిళ), భైంసా-జనరల్ నిర్మల్- జనరల్, ఖానాపూర్- ఎస్సీ, సారంగాపూర్- బీసీ, కుభీరు - జనరల్.

## మార్గదర్శకాలు రావాల్సి ఉంది..

- శ్రీనివాస్, ఏడీ, మార్కెటింగ్ శాఖ,

ప్రభుత్వం మార్కెట్ పాలకవర్గాలను రద్దు చేసింది. కొత్త పాలకవర్గాల ఏర్పాటుపై కొంత సమాచారం ఇచ్చిందని మార్కెటింగ్ శాఖ ఏడీ శ్రీనివాస్ వివరించారు. మార్గదర్శకాలపై మరింత స్పష్టత రావాల్సి ఉందని, గతంలో ప్రకటించిన రిజర్వేషన్లు, ఇప్పుడు అమలయ్యే వాటిని ఉన్నతాధికారుల పరిశీలనకు పంపించామని ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు.జిల్లాలోని పాలకవర్గాలను రద్దు చేశారు. ప్రస్తుతం పర్సన్ ఇన్చార్జీలు కొనసాగు తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పీసా చట్టం అమలులో ఉ ఒడటంతో జైనూర్, ఇంద్రవెల్లి,ఇచ్చోడ మార్కెట్లలో ఎస్టీ సామాజిక వర్గం వారినే నియమించాల్సి ఉంటుందని తెలిపారు.


# సింగర్ చిన్మయి శ్రీపాదపై కేసు



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : స్టార్ సింగర్ చిన్మయి శ్రీపాద భారత దేశం పట్ల మాట్లాడిన అగౌరవమైన అనుచిత వ్యాఖ్యలు కిండిస్తు, గచ్చిబౌలి పోలీసు స్టేషన్ లో పిర్యాదు.. సీనియర్ నటి అన్నపూర్ణమ్మకి కౌంటర్‌గా సింగర్ చిన్మయి శ్రీపాద మాట్లాడుతూ మధ్యలో భారత దేశాన్ని స్టుపిడ్ కంట్రీ( చెత్త దేశం) గా, భారత దేశంలో పుట్టడం నా కర్మా అని చిన్మయి ఇన్‌స్టాగ్రామ్ వేదిక అన్నారు. అన్నపూర్ణమ్మ కి ఏమైనా చెప్పలనుకుంటే అమే గురించి మాత్రమే చెప్పాలి కానీ భారత దేశాన్ని తక్కువ చేసి మాట్లాడడం స ౖన పద్ధతి కాదు. భారతదేశంలో ఉంటూ భారతదేశ సౌకర్యాలు అనుభవిస్తూ, భారత దేశపు గాలి పీల్చి. భారత దేశం లో పుట్టడమే కర్మ అనడం, భారతదేశం ఒక చెత్త దేశం అని అనటం బాధని మరియు కోపాన్ని కలిగించే విషయం. బాధ్యత గల పౌరుడిగా భారత దేశం పట్ల అగౌరవమైన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తు, గచ్చిబౌలి పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేశారు.

# చేవేళ్ల పోటీకి రంజిత్ రెడ్డి దూరం

రంగారెడ్డి, ప్రభాతసూర్యుడు : బీఆర్ఎస్ కు రోజుకో ఇబ్బంది వచ్చిపడుతూనే ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఆ పార్టీ అధినాయకత్వాన్నే కాదు నేతలను కూడా వణికిస్తోంది. బీఆర్ఎస్ నుండి పోటీ అంటే నేతలంతా గతంలో సంతోషపడేవారు. టికెట్ కోసం పైరవీలు చేసుకునే వారు. కానీ ఇప్పుడు పిలిచి టికెట్ ఇస్తామన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచించుకునే పరిస్థితి ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేటీఆర్ లోక్ సభ ఎన్నికలకు రివ్యూలు చేశారు. అందులో ఫస్ట్ రివ్యూ చేసిన స్థానం చేవేళ్ల. సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి మళ్లీ పోటీ చేస్తారని ప్రకటించారు కూడా. ఆయన కూడా గ్రౌండ్ రెడీ చేసుకున్నారు. కానీ చేవేళ్లలో ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. బలమైన నేతగా ఉన్న పట్నం మహేందర్ రెడ్డి దంపతులు కాంగ్రెస్ కు జైకొట్టారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు జెడ్పీ ఛైర్మన్ కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారు. ఇక బీఆర్ఎస్ లో ఉన్న గ్రూప్ గొడవలకు తోడు, బీజేపీ నుండి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. చేవేళ్ల ఇంచార్జ్ గా సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఉండటంతో ఆ పార్టీ ప్రతి ష్టాత్మకంగా తీసుకుంది. దీంతో, పోటీపై ఎంపీ రంజిత్ రెడ్డి పునరాలో చనలో పడ్డట్లు తెలుస్తోంది. త్రిముఖ పోటీ జరిగితే బీఆర్ఎస్ కు ఇబ్బంది అన్న ఉద్దేశంతో రంజిత్ రెడ్డి పోటీ నుంచి తప్పుకుంటున్నారు. అధిష్టానా నికి ఇప్పటికే సమాచారం ఇచ్చారని సమాచారం. దీంతో పార్టీ మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి కొడుకు కార్తీక్ రెడ్డి అవకాశం ఇవ్వబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. సబితా ఇంద్రారెడ్డి ఫ్యామిలీ కన్నా పెద్ద లీడర్ ఎవరూ ఇప్పటికిప్పుడు ఎంపీగా నిల్చుకునే పరిస్థితి లేకపోవటంతో... పార్టీ కూడా



కార్తీక్ రెడ్డికి టికెట్ ఇచ్చే అవకాశా లున్నాయి. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ అధిష్టానం పని చేసుకోవాలని సూచించినట్లు తెలంగాణ భవన్ వర్గాల కథనం. మొన్నటి వరకు సికింద్రాబాద్ సీటు కోసం ప్రయత్నించిన కార్తీక్ రెడ్డి చేవేళ్ల బరిలో ఉంటారో లేదో వేచి చూడాలి.




# హాలియాలో నెగ్గిన అవిశ్వాపం

నల్గోండ-ప్రభాతసూర్యుడు : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని హాలియా మున్సిపల్ చైర్ పర్సన్ వెంపటి పార్వతమ్మ, వైస్ చైర్మన్ సుధాకర్ లపై అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశం జరిగింది. మొత్తం కౌన్సిలర్లు 12 మంది కాగా.. చైర్మన్,వైస్ చైర్మన్ గైర్హాజరు అయ్యారు. మిగతా పది మంది కౌన్సిలర్లు అవిశ్వాస పరీక్షకు మద్దతు తెలపడతో అవిశ్వాసం నెగ్గింది.

# బీజేపీ బైకు ర్యాలీని ప్రారంభించిన కుష్బూ

సికింద్రాబాద్ - ప్రభాతసూర్యుడు : ప్రపంచంలో మూడవ ఆర్థిక శక్తిగా భారత్ ను నిలపడమే ధ్యేయంగా రాబోయే పార్లమెంటు ఎన్నికలలో మోడీ గెలుపు లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జాతీయ భాజపా కార్యవర్గ సభ్యురాలు కుష్బూ సుందర్ పిలుపునిచ్చారు..వికసిత భారత్ లక్ష్యంగా కేంద్రంలో భాజపా ను గెలిపించాలని కుష్బూ కోరారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా కంటోన్మెంట్ నియోజకవర్గంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆమె ప్రారంభించారు.కంటోన్మెంట్ సమస్యలను తీర్చేదే కేంద్రమని కంటోన్మెంట్ ప్రజలు ఆలోచించి ఓటు వెయ్యాలన్నారు.ఒక్క నిమిషం కూడా సమయాన్ని వృధా చేయకుండా దేశం కోసం పని చేస్తున్న వ్యక్తి మోడీ అని



పేర్కొన్నారు. 400 సీట్లతో రాబోయే పార్లమెంటు ఎన్నికలలో మోడీ విజయ ఢంఖా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.డిజిటల్ రంగంలో,విమానయాన,రైల్వే,త్రివిధ దళాలు,జాతీయ రహదారులు,అన్నిరంగాల్లో వృద్ధిని సాధించారన్నారు. మహిళలు,యువత కు అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు.కరోనా విపత్కర సమయంలో అందరికీ ఉచితంగా టీకాలు ఇచ్చామని, ఆర్టికల్ 370,ట్రిపుల్ తలాక్ రద్దు చేసి ముస్లిం మహిళలకు స్వేచ్ఛ కల్పించినట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో గొప్ప అవకాశాలను కల్పించిందన్నారు.కాంగ్రెస్ లో కుటుంబ పాలన తప్ప దేశానికి చేసిందేమీ లేదని అన్నారు..

# పెద్దపల్లిలో ఆపరేషన్ గరుడ

పెద్దపల్లి- ప్రభాతసూర్యుడు : పెద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ గరుడ పేరుతో డ్రోన్ నిఘా ప్రారంభించనున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏసీపీ, సర్కిల్, స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆయన సందర్శించారు. పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలతో పాటు పోలీస్ స్టేషన్ లోని రిసెప్షన్ సెంటర్, కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించి రికార్డులను, సిసి కెమెరాల పనితీరు ను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న పని తీరు పై, జిల్లా కేంద్రంతోపాటు గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా సహకరించాలన్నా రు. అలాగే బ్లూకోట్స్ టీమ్‌లు 24 గంటలపాటు పని చేస్తాయన్నారు. పెట్రోలింగ్ ముమ్మరం నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. అసాంఘీక శక్తుల నిర్మూలనకు పెద్దపల్లిలో ప్రయోగాత్మకంగా



ఆపరేషన్ గరుడ మొదలు పెడతామని సీపీ తెలిపారు. పెద్దపల్లి పట్టణ కేంద్రంతోపాటు శివారు ప్రాంతాల్లో అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు ఆపరేషన్ గరుడ పేరిట డ్రోన్‌లతో పెట్రోలింగ్ నిర్వహించి ప్రత్యేక నిఘా ప్రారంభిస్తామన్నారు. పెద్దపల్లిలో విజయవంతమైతే కమిషనరేట్ వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపి రమేష్, సీఐ కృష్ణ, ఎస్ఐ లు లక్ష్మణ్‌రావు, మల్లేష్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో దొంగలు పడ్డారు

**రంగారెడ్డి - ప్రభాతసూర్యుడు :** కూకట్పల్లి రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ తెల్లవారుజామున దొంగలు పడ్డారు. రికార్డ్ రూమ్ కి చెందిన నాలుగు గ్రిల్స్, రెండు తలుపుల తాళాలు తొలగించి దుండగులు లోనికి ప్రవేశించారు. ఉదయం కార్యాలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన పారిశుధ్య కార్మికులు గేట్లు, తలుపులు తెరిచి ఉండటం గమనించి అధికారులకు సమాచారం అందించింది. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సతీష్ మాట్లాడుతూ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసామని, రికార్డ్స్ గదిలో ఏమి చోరికి గురయ్యాయి అనేది అంతర్గత విచారణ చేస్తున్నామని, పోలీసులకు విచారణలో సహకరిస్తామని తెలిపారు.



# సంపాదకీయమ్..

## పెద్దలసభ ఎన్నికలలో ట్విస్టులు

దేశాన్ని పదేళ్లుగా బీజేపీ పాలిస్తోంది. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం ఉన్నా 2014, 2019 ఎన్నికల తర్వాత మిత్ర పక్షాలతో కలిసి ఎన్డీఏ కూటమి అధికారంలో కొనసాగుతోంది. ఎన్నికల్లో ఆయా పార్టీల ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కానీ.. ఇది ఫక్తు.. ఒత్తిళ్లు, స్వలాభాలు, బుజ్జగింపులతో నిండిపోవడంతో పెద్దల సభ ఎన్నికలపై పెద్ద మచ్చే వేసేసింది. తాజాగా రాజ్యసభకు ఏకగ్రీవాలు కాని మూడు రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. అయినప్పటికీ రాజ్యసభలో ఇప్పటికీ పూర్తి స్థాయి బలం లేదు. ఏదైనా చట్టం ఆమోదం పొందాలంటే బీజేపీ, ఎన్డీఏ పార్టీలే కాకుండా ఎన్డీఏ కూటమి బయటి పార్టీ సభ్యులు కూడా మద్దతు తెలిపితేనే జరుగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా జరిగిన ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ భారీగా రాజ్యసభ స్థానాలు దక్కించుకుంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రాజ్యసభలో ఏ పార్టీకి ఎంత మద్దతు ఉంది.క్రాస్ ఓటింగ్, ఇండిపెండెంట్‌ల మద్దతు, ఆయా రాష్ట్రాల్లో సంచలన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంగళవారం 3 రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు జరిగాయి. అయితే మొత్తం ఖాళీ కానున్న 56 స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కాగా.. 41 సీట్లు ఏకగ్రీవం కాగా.. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో 15 స్థానాలకు ఎన్నికలు త్తరప్రదేశ్. ఇక్కడ అత్యధికంగా 10 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు నిర్వహించారు. అయితే.. పోరు హోరాహోరీగానే ఉంటుందని అంచనా వేసినట్టే అలానే జరిగింది. కానీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. బీజేపీ కి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ వేయడంతో ఇక్కడ అంచనా తప్పిపోయింది. దీంతో బీజేపీకి ఎమ్మెల్యేల సంఖ్యాపరంగా దక్కాల్సిన స్థానాలకంటే.. కూడా ఒకటి ఎక్కువగా కలిసివచ్చింది. ఇక్కడి మొత్తం 10 స్థానాల్లో బీజేపీ ఎనిమిది(8) స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. ప్రధాన ప్రతిపక్షం సమాజ్ వాదీ పార్టీ మూడు స్థానాలు గెలుచుకునే అవకాశం ఉన్నప్పటికీ.. బీజేపీ ప్రలోభాలు పెట్టిందనే వాదన వినిపించింది. దీనికి తగ్గట్టుగానే.. ఇక్కడ ఎస్పీ కేవలం రెండు స్థానాల విజయంతో సరిపెట్టుకుంది. ఇక, కాంగ్రెస్ పార్టీ మరో స్థానం దక్కించుకుంది. మొత్తంగా బీజేపీదే పైచేయిగా సాగింది. తమ బలానికి మించి బీజేపీ మరోఅభ్యర్థిని నిలబెట్టడం గమనార్హం. అంతేకాదు.. క్రాస్ ఓటింగును ప్రోత్సహించడం ద్వారా తన బలానికి మించి మరో స్థానాన్ని కమల నాథులు రాబట్టారు. ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయాన్ని ఊహించని సీట్లను దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ వ్యూహానికి అడ్డుకట్ట వేయలేక పోయింది. దీంతో బీజేపీ ఒక సీటును ఇక్కడ కైవసం చేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలను దక్కించుకోగా, నాలుగో స్థానం కోసం బరిలోకి దిగిన బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి ఓటమిపాలయ్యారు. మొత్తంగా చూస్తే.. నాలుగు స్థానాలు దక్కించుకునే అవకాశాన్ని ఇక్కడ కాంగ్రెస్ వదులుకున్నట్టు అయింది. ఉత్తరాదికి-ఈశాన్యానికి అటు ఇటు ఉండే హిమాచల్ ప్రదేశ్‌లో ఒకే ఒక్క రాజ్యసభ స్థానానికి ఎన్నిక జరిగినా.. తీవ్ర ఉత్కంఠ మాత్రం కొనసాగింది. వాస్తవానికి ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ఉంది. అయినప్పటికీ.. రాజ్యసభ ఎన్నికలపై పట్టు కోల్పోయిందనే వాదన వినిపిస్తోంది. అసెంబ్లీ బలాబలాలను చూస్తే.. కాంగ్రెస్‌కు 45 మంది, బీజేపీకి 25 మంది ఎమ్మెల్యేలు, మరో ముగ్గురు ఇండిపెండెంట్లు ఉన్నారు. దీంతో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ముందుకు సాగి ఉంటే.. ఫలితం అనుకూలంగా వచ్చేది. కానీ, ముందు నుంచి అతిధీమా వ్యక్తం చేయడంతో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీ ఓడిపోయారు. బీజేపీ అభ్యర్థి హర్ష మహాజన్ కు, ఆయనకు సమానంగా చెరో 34 ఓట్లు వచ్చాయి. దీంతో డ్రా తీయగా విజయం మహాజన్ ను వరించింది. కాంగ్రెస్ ఎమ్మెల్మేలు ముగ్గురు బీజేపీకి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ చేశారు. దీంతో తన సొంత రాష్ట్రంలో కాంగ్రెస్ పట్టు నిలుపుకోలేక పోయింది. అయితే ఏకగ్రీవం అయిన 41 స్థానాల్లో 30 సీట్లను బీజేపీ గెలుచుకుంది. ఇక 15 స్థానాల్లో బీజేపీ 10, కాంగ్రెస్ 3, సమాజ్‌వాదీ పార్టీ 2 సీట్లు సాధించాయి. ఇక హిమాచల్ ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్, ఎస్పీ ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతుగా క్రాస్ ఓటింగ్ వేశారు. ఇక కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా బీజేపీ నేతలు ఓటు వేయడం సంచలనంగా మారింది. ఇక హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికలు ఏకంగా ఆ రాష్ట్ర ప్రభుత్వాన్నే కూల్చే స్థాయికి చేరుకున్నాయి. రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 240. మెజారిటీ దక్కించుకోవాలంటే 121 మంది సభ్యులు అవసరం. ప్రస్తుతం రాజ్యసభలో బలాబలాలను చూస్తే 97 మంది సభ్యులు బీజేపీకి ఉన్నారు. ఇక ఎన్డీఏ పార్టీలతో కలిపి 117 ఎంపీల సంఖ్యా బలం ఉంది. పెద్దల సభలో మెజారిటీ 121 మంది సభ్యులు అవసరం కాగా ఎన్డీఏకు 117 మంది ఉండగా.. మెజారిటీకి నలుగురు సభ్యులు మాత్రమే తక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే రాజ్యసభలోనే అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఇక కాంగ్రెస్ పార్టీకి 29, తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి 13 మంది, డీఎంకే 10, ఆమ్ ఆద్మీ పార్టీలకు 10 మంది, బీజేడీ 9, వైఎస్‌ఆర్‌పీ 9, బీఆర్ఎస్ 7, ఆర్జేడీ 6, సీపీఎం 5, ఏఐడీఎంకే 1, జేడీయూకు ఒక చొప్పున రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. ఎన్నికలు జరిగిన 56 సీట్లలో 41 ఏకగ్రీవం కాగా.. 15 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 56 రాజ్యసభ స్థానాల్లో బీజేపీ 30 స్థానాలను దక్కించుకుంది. అయితే ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో భాగంగా.. కర్ణాటకలో నాలుగు స్థానాల్లో మూడింటిని కాంగ్రెస్ గెలుచుకుంది. ఒక స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. అటు.. ఉత్తర్‌ప్రదేశ్‌లో మొత్తం 10 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగ్గా 8 సీట్లను బీజేపీ గెలుచుకోగా.. రెండింటిని సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకుంది. నిజానికి ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీలో బీజేపీకి సొంతంగా 7 స్థానాలు గెలుచుకునే బలం మాత్రమే ఉండగా.. ఎస్పీ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో మరో స్థానాన్ని దక్కించుకుంది. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్న ఏకైక స్థానాన్ని బలం ఉన్నప్పటికీ కాంగ్రెస్ గెలవలేకపోయింది. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులు బీజేపీకి ఓటేయడంతో బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు.

## అంబానీ వారి వివాహ భోజనంబు!

- ముఖేశ్ అంబానీ కుమారుడి పెళ్లి విందు
- ప్రీ వెడ్డింగ్ వేడుకల్లో భాగంగా అన్న సేవ
- జోగ్వాడ్ గ్రామస్తులకు సంప్రదాయ భోజనం



**ముంబై, ప్రభాతసూర్యుడు :** సామాన్యుల ఇంట పెళ్లి అంటేనే మేళతాళాలు, భాజాభజంత్రీలు, చుట్టపక్కాలతో నానా హడావుడి ఉంటుంది. జీవితంలో ఒక్కసారే వచ్చే అపురూపమైన ఘట్టాన్ని ఆనందమయంగా జరుపుకునేందుకు స్థోమతకు మించి ఖర్చు చేస్తారు. అప్పు చేసి మరీ ఘనంగా పెళ్లి జరిపిస్తుంటారు. అతిథులు పదికాలాలు గుర్తుంచుకునేలా పదిరకాల వంటలు పెళ్లి ఇంట ఘుమఘుమలాడిపోతాయి. అలాంటిది ఆసియాలో అతిపెద్ద కుభేరుడు ఇంట పెళ్లి అంటే ఏ రేంజ్‌లో ఏర్పాట్లు ఉంటాయో ఊహించుకోండి. భారత దేశ అపర కుబేరుడు ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ పెళ్లి చేసుకోబోతున్న విషయం తెలిసిందే. వీరిద్దరి వివాహం కొద్దిరోజుల్లోనే జరుగబోతుంది. అయితే పెళ్లికి ముందే ప్రీ వెడ్డింగ్ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జామ్ నగర్ లోని రిలయన్స్ టౌన్ షిప్ సమీపంలోని జోగ్వాడ్ గ్రామంలో ముకేశ్ అంబానీ అనంత్ అంబానీ, రాధికా మర్చంట్, ఇతర అంబానీ కుటుంబ సభ్యులతో కలిసి గ్రామస్థులకు సంప్రదాయ గుజరాతీ ఆహారాన్ని వడ్డించారు. రాధిక అమ్మమ్మ, తల్లిదండ్రులు వీరేన్, శైలా మర్చంట్ కూడా అన్నదాన సేవలో పాల్గొన్నారు.సుమారు 51 వేల మంది స్థానికులకు భోజనం వడ్డించనున్నారు. అయితే ఈ కార్యక్రమంలో రాబోయే కొన్ని రోజుల పాటు కొనసాగుతుంది. అంబానీ కుటుంబం స్థానికుల ఆశీర్వాదం పొందడానికి అన్న సేవను నిర్వహించింది. భోజనానంతరం హాజరైన వారు సంప్రదాయ జానపద సంగీతంతో మైమరిచిపోయారు. ప్రఖ్యాత గుజరాతీ గాయకుడు కీర్తిదాన్ గాఢ్వీ ఈ కార్యక్రమానికి సంగీత ఆకర్షణను నిలిచాడు.అంబానీ కుటుంబంలో ఫుడ్ సర్వీస్ సంప్రదాయం ఎప్పటి నుంచో ఉంది. కుటుంబ శుభకార్యాల సమయంలో అంబానీ కుటుంబం ఆహార సేవలను అందిస్తూనే ఉంటుంది. కోవిడ్-19 మహమ్మారి సంక్షోభంలో ఉన్నప్పుడు, దేశం కష్టాల్లో ఉన్నప్పుడు, అనంత్ అంబానీ తల్లి నీతా అంబానీ నాయకత్వంలో, రిలయన్స్ ఫౌండేషన్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది. కుటుంబ సంప్రదాయాన్ని పాటిస్తూ అనంత్ అంబానీ ఫుడ్ సర్వీస్ తో ప్రీ వెడ్డింగ్ ఈవెంట్స్ ను ప్రారంభించారు.రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఇంట ఇప్పుడు అదే హడావుడి జరుగుతోంది. ఆయన చిన్న కుమారుడు అనంత్ అంబానీ పెళ్లివేడుకలు కనీవిని ఎరగని రీతిలో నిర్వహిస్తున్నారు.

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, అపర కుబేరుడు ముకేశ్ అంబానీ- నీతా అంబానీల చిన్న కుమారుడు అనంత్ అంబానీ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌కి సర్వం సిద్ధమవుతోంది. జులై 12వ తేదీన అనంత్ అంబానీ వివాహం జరగనుంది. ఈ క్రమంలో గుజరాత్‌లోని జామ్‌నగర్ లో మార్చి 1 నుంచి మూడు రోజుల పాటు ముందస్తు పెళ్లి వేడుకలు నిర్వహించనున్నారు. ఎన్‌కోర్ హెల్త్ కేర్ సీఈఓ వీరేన్ మర్చంట్- శైలా మర్చంట్ చిన్న కుమార్తె రాధికా మర్చంట్‌తో అనంత్ అంబానీ పెళ్లి జరుగుతోంది. ఈ ముందస్తు పెళ్లివేడుకలకు దేశంలోని ప్రముఖులు హాజరుకానున్నారు. ప్రపంచ నలుమూలల నుంచి అతిరథ మహారథులు తరలిరానున్నారు. వీరికోసం ఘుమఘుమలాడే వంటకాలను సిద్ధం చేస్తున్నారు. దీనికి కోసం దేశంలోనే అత్యంత పేరుగడించిన 25 మందితోకూడా చెఫ్‌ల బృందం ఇండోర్ నుంచి జామ్‌నగర్‌కు వెళ్లనుంది. దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన వంటకాలతోపాటు ఇండోర్ ఫుడ్‌కు ప్రాధాన్యమివ్వనున్నారు. పార్సీ నుంచి థాయ్ వరకు, మెక్సికన్ నుంచి జపనీస్ వరకు అన్ని రకాల వెరైటీలు సిద్ధం చేయనున్నారు. ముఖ్యంగా ఆసియన్ వంటలకు ప్రాధాన్యమివ్వనున్నారు. అంతేకాకుండా వచ్చే అతిథులకు ఏమైనా స్పెషల్ వంటకం కావాల్సి వస్తే చిటికెలో అందించి ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్య అతిథుల ఆహార అవసరాలకు అనుగుణంగా మెనూ సిద్ధం చేస్తున్నారు. ముందస్తు పెళ్లి వేడుకలకు వచ్చిన అతిథులు జీవితంలో మర్చిపోలేని విధంగా రుచికరమైన పదార్థాలు సిద్ధం చేస్తున్నారు.

మూడురోజుల పాటు జరగనున్న ముందస్తు పెళ్లి వేడుకల కోసం దాదాపు 2,500 రకాల వంటకాలను వడ్డించనున్నారు.ఒకరోజు వడ్డించిన వంటకాలు మరో-రోజు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నార. కేవలం అల్పాహారం కోసమే 70 రకాల వంటకాలను సిద్ధం చేస్తున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం లంచ్ కి 250 రకాలు, రాత్రి డిన్నర్ కు మరో 250 రకాల పదార్థాలను వడ్డించనున్నారు. శాఖాహారి అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మూడురోజులపాటు రేయింబవళ్లు జరగనున్న వేడుకల కోసం అర్ధరాత్రికి కూడా స్నాక్స్ అందించనున్నారు.ప్రపంచనం నలుమూలల నుంచి వెయ్యిమందికి పైగా అత్యంత ప్రముఖులైన వెయ్యిమందికి పైగా అతిథులు హాజరుకానున్నారు . వీరిలో బిల్ గేట్, మెలిండా గేట్స్ తోపాటు మెటా సీఈఓ మెటా సీఈఓ మార్క్‌జూకర్‌బర్గ్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్, అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, బ్లాక్ రాక్ సీఈఓ లారీ ఫింగ్, అడ్నాక్ సీఈఓ సుల్తాన్ అహ్మద్, వాల్ట్ డిస్నీ సీఈఓ బాబా ఐగర్ వంటి వారు ఉన్నారు. అలాగే దేశీయ వ్యాపార దిగ్గజాల్లో గౌతమ్ అదానీ, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, గోద్రేజ్ కుటుంబం, ఇన్ఫోసిస్ ఛైర్మన్ నందన్ నీలేకనీ, బిర్లా గ్రూప్ ఛైర్ పర్సన్ కుమార్ మంగళం బిర్లా, సునీల్ మిట్టల్, పవన్ ముంజాల్, నిఖిల్ కామత్, దిలీప్ సంఘ్వీ వంటి వారికి ఆహ్వానాలు వెళ్లాయి. బాలీవుడ్ ప్రముఖుల్లో అమితాబ్ బచ్చన్, షారుక్ ఖాన్ సహా క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనీతో పాటు ముంబయి ఇండియన్స్ టీం సభ్యులను ఆహ్వానించారు.

## హుండీల్లో దొంగ నోట్లు

**వరంగల్, ప్రభాతసూర్యుడు :** గిరిజన కుంభమేళా మేడారం మహా జాతర హుండీల లెక్కింపును అధికారులు గురువారం ప్రారంభించారు. పటిష్ట భద్రత మధ్య హనుమకొండ కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో దేవాదాయ సిబ్బంది, రెవెన్యూ, పోలీసులు, మేడారం పూజారుల సమక్షంలో హుండీ ఆదాయం కౌంటింగ్ చేపట్టారు. ఈ క్రమంలో తొలి రోజే హుండీలో నకిలీ కరెన్సీ నోట్ల కలకలం రేగింది. మొదట ఓపెన్ చేసిన హుండీలో అంబేద్కర్ ఫోటోతో ముద్రించిన నకిలీ కరెన్సీని చూసిన సిబ్బంది ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఇలా పదుల సంఖ్యలో అంబేద్కర్ ఫోటోతో ముద్రించిన రూ.100 నోట్లు భారీగా బయటపడ్డాయి. ఇప్పటివరకూ 20కి పైగా నకిలీ కరెన్సీని గుర్తించి వాటిని పక్కన పెట్టారు. కాగా, మేడారం జాతరలో మొత్తం 518 హుండీలు ఏర్పాటు చేయగా అవన్నీ నిండిపోయాయి. అయితే, గత జాతరలో కొంత మంది భక్తులు విచిత్రంగా వారి కోరికలను పేపర్ పై రాసి హుండీలో వేశారు. ఈసారి ఫేక్ కరెన్సీ బయటపడింది.ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 21 నుంచి 24 వరకు మేడారం సమ్మక్క సారలమ్మల జాతర ఘనంగా జరిగింది. దాదాపు 1.40 కోట్ల మంది భక్తులు వన దేవతలను దర్శించుకున్నారని అధికారులు అంచనా వేశారు. భక్తులు కానుకలను సమర్పించేందుకు దేవాదాయ శాఖ 518 హుండీలను ఏర్పాటు చేసింది. గురువారం హుండీల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కాగా.. 350 మంది సిబ్బంది కౌంటింగ్ లో పాల్గొంటున్నారు. 150 మంది దేవాదాయ శాఖ సిబ్బంది. 200 మంది స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు హుండీలు లెక్కిస్తున్నారు. నోట్లు, కాయిన్స్, బియ్యం వేరు చేయడం కోసం అధికారులు ప్రత్యేకంగా రెండు మిషన్లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాల్ లో నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కౌంటింగ్ కొనసాగుతుంది. హుండీల లెక్కింపు పూర్తయ్యే సరికి వారం నుంచి పది రోజులు పడుతుందని మేడారం ఈఓ రాజేందర్ తెలిపారు.








## మహంకాళి ఆలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ఠ

**అంబర్ పేట- ప్రభాతసూర్యుడు :** అమ్మవారి ఆశీస్సులతో రానున్న రోజుల్లో సకాలంలో వర్షాలు పడి రాష్ట్రంలో పాడిపంటలతో పరిఢవిల్లాలని అందరి జీవితాలు సుఖ సంతోషాలు నిండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి హనుమంతరావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు.. అంబర్పేట్ లోని మహంకాళి అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభ పునర్ ప్రతిష్ట కార్యక్రమాన్ని దేవస్థానం కమిటీ ఘనంగా నిర్వహించారు... మహంకాళి అమ్మవారి ధ్వజస్తంభం పునర్ ప్రతిష్టాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. అంబర్పేట్ లోని మహంకాళి అమ్మవారు చాలా మహిమాన్విత శక్తి కలిగిన అమ్మవారిని ప్రతి సంవత్సరం ఇక్కడ నిర్వహించే బోనాలు ఈ ప్రాంత ప్రత్యేకతను తెలియజేస్తుందని తాము ఏ కార్యక్రమం చేపట్టిన ఇక్కడి నుంచి అమ్మవారికి పూజా కార్యక్రమం నిర్వహించిన తర్వాతనే ప్రారంభవిస్తామని నాయకులు తెలిపారు.

## అక్రమ బియ్యం పట్టివేత



**రంగారెడ్డి- ప్రభాతసూర్యుడు :** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని టాటా నగర్ లో బియ్యం గోదాం పై పౌరసరఫరాల శాఖ తో పాటు విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. పదివేల బస్తాల బియ్యం బస్తాలు గుర్తించారు. బియ్యం బస్తాలకు వివిధ బ్రాండ్ పేర్లతో పాటు ఎలాంటి పేర్లు లేకుండా బియ్యం బస్తాలు నిలువ వుంచారు. బియ్యం దిగుమతికి సంబంధించి సరైన ఆధారాలు లేవని గుర్తించారు. ఇతర రాష్ట్రాల నుండి మామూలు బియ్యంను కొనుగోలు చేసి వాటికి గోదాంలో అక్రమంగా పాలిష్ చేసి ఖరీదైన మేలు రకం బియ్యం గా పేర్కొంటూ వివిధ బ్రాండ్ల పేర్లతో బియ్యం విక్రయాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. నిల్వ చేసి ఉంచిన బియ్యం బస్తాలలో రేషన్ బియ్యం ఉన్నాయనే అనుమానాలు వున్నాయి. శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు తరలించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215